క్లుప్తంగా

నేడు కేవీకేలో స్వర్ణోత్సవాలు

కందుకూరు: రంగారెడ్డి జిల్లా కృషి విజ్ఞాన్ కేంద్రంలో బుధవారం స్వర్ణోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కేవీకే ఆవిర్భవించి 50 సంవత్సరాలు కావడంతో ఆ సంస్థ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నారు. హయత్‌నగర్ కార్యాలయానికి రైతులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయంలో పూజలు

దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయంలో పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారుల తీరారు. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో దర్శనానికి ఉదయం నుంచే క్యూలో వేచియున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు బోనం, నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పూజారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డికి సన్మానం

తలకొండపల్లి: మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన నవీన్‌రెడ్డిని బీఆర్‌ఎస్ సీనియర్ నేత శ్రీనివాస్‌యాదవ్ మంగళవారం మామాడిపల్లిలో ఘనంగా సన్మానించారు. మండలాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ముజీబర్ రహ్మాన్, దస్తగిరి, మహేష్, శ్రీరామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 23, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 50, కాకర 38, బీర 35, క్యాలీఫ్లవర్23, క్యాబేజీ 19, క్యారెట్ 40, దొండ 18, ఆలు 33, ఉల్లి 27, గోకర 45, దోస 23, సొర 11, పొట్ల 15, అరటి 10, చిక్కుడు 65, అర్వి 40, మునగ 45, చిలగడదుంప 65, బీట్‌రూట్ 23, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 105, కాప్సికమ్ 50. ఈ ధరలు బుధవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఈటలకు కార్పొరేటర్ కళ్లెం శుభాకాంక్షలు

హయత్‌నగర్: మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి అపూర్వ విజయం సాధించిన బీజేపీ నేత ఈటల రాజేందర్‌ను మంగళవారం హయత్‌నగర్ డివిజన్ కారొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పార్టీ కార్యకర్తలతో కలిసి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బండారి భాస్కర్, పిరంద మహేష్, గోవిందాచారి, సత్యనారాయణ, గంగని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఫౌండేషన్‌కు నిత్యావసరాల వితరణ

చైతన్యపురి: బీఆర్‌ఎస్ చైతన్యపురి సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆదర్శ ఫౌండేషన్ ఆశ్రమం, వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు, వంటసామగ్రి అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి చిన్నారులు, వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే, జీహెచ్‌ఎంసీ శానిటేషన్ మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కనకదుర్గ ఆలయ ధర్మకర్తలు కృష్ణ, శిల్ప, బీఆ ర్‌ఎస్ నాయకులు మోహన్ రాజ్, జాన్‌కిరణ్, కిరణ్, శ్రీధర్ నరేష్, వెంకన,గణేష్, నవీన్, కల్యాణ్, రాంబాబు, ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలి

ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి

నందిగామ: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మామిడిపల్లిలోని శ్రీరామచంద్రస్వామి దేవాలయంలో నవీన్‌రెడి, లక్ష్మి దంపతులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. కోరిన కోరికలు నెరవేర్చే సీతారామచంద్రస్వామి స్వామి వారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందు ఈ దేవాలయంలో ప్రత్యేకంగా మొక్కుకున్నట్లు చెప్పా రు. కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్‌గౌడ్, గణేశ్‌గౌడ్, నర్సింహాగౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎమ్మెల్సీగా విజయం సాధించిన నవీన్ రెడ్డిని మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయ కులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.



మహేశ్వరం: నాగారంలో సంబురాలు చేసుకుంటున్న నాయకులు



కందుకూరు చౌరస్తాలో టపాసులు కాల్చి సంబురాలు చేసుకుంటున్న నాయకులు, కార్యకర్తలు

బీజేపీ నాయకుల సంబురాలు

- రాష్ట్రంలో 8 ఎంపీ సీట్లు కైవసంపై హర్షం
- బాణసంచా కాల్చి, స్వీట్లు తినిపించుకున్న నేతలు, కార్యకర్తలు



బడంగ్‌పేట్: నాదర్‌గుల్ రోడ్లపై సంబురాల్లో నాయకులు



తుక్కుగూడ: రావిర్యాలలో సంబురాలు జరుపుకొంటున్న బీజేపీ నాయకులు

కందుకూరు: చేవెళ్ల నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలిచిన సందర్భంగా కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. దీంతో పాటు కేంద్రంలో మూడోసారి నరేంద్రమోడీ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేయనుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం కందుకూరు చౌరస్తాలో బీజేపీ శ్రేణులు టపాసులు కాల్చి, స్వీట్లు తినిపించుకుని ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

బడంగ్‌పేట్‌లో..

బడంగ్‌పేట్: తెలంగాణతో పాటు దేశ వ్యాప్తంగా బీజేపీ ప్రభంజనం సృష్టించడంతో బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ ఇతర డివిజన్ల పరిధిలో సంబురాలు జరుపుకున్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు ఆధ్వర్యంలో నాదర్‌గుల్ రోడ్డుపై బాణాసంచా కాల్చారు. మోడీ హ్యాట్రిక్ సాధించినందుకు, తెలంగాణలో 8 ఎంపీ సీట్లు గెలిచామని అందెల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడారి జంగయ్య, కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, అధికార ప్రతినిధి రాజశేఖర్‌రెడ్డి, పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: తుక్కుగూడ మున్సిపాలిటీ వ్యాప్తంగా బీజేపీ మొదటి నుంచి మెజార్టీ కనబరించింది. మున్సిపాలిటీ వ్యాప్తంగా 21 బూత్‌లో 22,597 ఓట్లు ఉన్నాయి. ఇందులో 14,776 ఓట్లు పోలైనవి. మంగళవారం ప్రకటించిన ఎన్నికల ఫలితాల్లో బీజేపీ 8168, కాంగ్రెస్ 4036, బీఆర్ఎస్‌కి 1830, ఇతరులకు 742 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీతో పోల్చితే 4132 ఓట్లు ఆధిక్యం సాధించారు. తుక్కుగూడ, రావిర్యాల, మంఖాల్, సర్దార్‌నగర్, ఇమామ్‌గూడ, తదితర గ్రామాల్లో ఆపార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట: బీజేపీ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహా ఆధ్వర్యంలో మీర్‌పేట కూడలిలో పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నర్సింహా మాట్లాడుతూ దేశ రక్షణ, అభివృద్ధిని కోరి పార్టీకి ఓటు వేసిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించిన కార్యకర్తలకు ప్రత్యేకంగా దన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాజుల మధు, విక్కీసాగర్, కిషోర్, సోమేశ్వర్, కార్పొరేటర్లు నీలారవినాయక్, వేముల నర్సింహా, మమత, తదితరులు పాల్గొన్నారు.

పహాడీషరీఫ్‌లో..

పహాడీషరీఫ్: లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ ఘన విజయం సాధించడంతో జల్‌పల్లి మున్సిపాలిటీలో సంబురాలు చేసుకున్నారు. బాణాసంచా కాల్చి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఎంపీగా విజయం సాధించడంతో ఈ ప్రాంత అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేస్తారని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గొరిగే మల్లేష్, దూడల శేఖర్ గౌడ్, గౌర మురళి కృష్ణ, ఈరంకి నర్సింగ్ గౌడ్, ఎం.శ్రీకాంత్ గౌడ్, గొరిగే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మీర్‌పేట చౌరస్తాలో స్వీట్లు తినిపించుకుంటూ..



పహాడీషరీఫ్: జల్‌పల్లిలో నాయకులు, కార్యకర్తల కోలాహలం

అద్దె భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు



చేవెళ్లలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులకు స్థలం ఉన్నా..
- నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం
- సీఎం నిర్ణయంపై అధికారుల్లో ఆశలు

చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటిగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ఏళ్ల తరబడి ఈ కార్యాలయాలు అద్దెభవనాల్లోనే కొనసాగుతూ వస్తున్నాయి. కేవలం ఆదాయం అందించే వనరులుగానే చేసుకున్నాయే తప్పా వాటికి సొంత భవనాలు, సౌకర్యాలు కల్పించాలనే ఆలోచన చేయలేదు. నేడు కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారుల బేటీలో రాష్ట్రానికి ఆదాయ వనరులుగా ఉన్న ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు ఉండాలని భవనాలే కాదు వీటిని కార్పొరేట్ స్థాయిలో ఉండేలా చూడాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇక ముఖ్యమంత్రి స్థాయిలో తీసుకున్న ఈ నిర్ణయంతో కార్యాలయాలకు ఏళ్ల తరబడి వేధిస్తున్న అద్దెభవనాల సమస్యలు తీరనున్నాయే తెలుస్తోంది. సొంత భవనాలు రాబోతున్నాయనే వార్త అధికారులకు, సిబ్బందికి ఎంతో సంతోషాన్ని నింపుతోంది. ప్రభుత్వానికి ఎంతో ఆదాయాన్ని అందిస్తున్న ఈ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవటంపై గత ప్రభుత్వ నిర్లక్ష్యం ఉట్టిపడినట్లు కన్పిస్తోంది.

రెండు అద్దెభవనాల్లోనే..

చేవెళ్ల నియోజకవర్గంలో చేవెళ్ల, శంకర్‌పల్లిలో రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఈ రెండు కార్యాలయాలు అద్దె భవనాల్లోనే ఏళ్ల తరబడిగా కొనసాగుతున్నాయి. జిల్లాలో అత్యధికంగా రిజిస్ట్రేషన్‌లు జరిగే కార్యాలయాల్లో చేవెళ్ల, శంకర్‌పల్లి కూడా ముందు వరుసలో ఉన్నాయి. అయితే వీటికి ఇప్పటివరకు సొంత భవనాలు లేకపోవటం గమనార్హం. కార్యాలయాలకు ప్రభుత్వం స్థలాలను సైతం కేటాయించింది. చేవెళ్లలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేవెళ్లలోని కోర్టు పక్కన 9 గుంటల భూమిని ప్రభుత్వం కేటాయించింది. శంకర్‌పల్లిలో బీడీఎల్‌కు వెళ్లే రోడ్డులో ఉన్న ప్రభుత్వ స్థలంలో 20 గుంటల స్థలం కేటాయించింది. వీటికి సంబంధించిన నిధులు కేటాయించి ఉంటే సొంత భవన నిర్మాణం ఎప్పుడో జరిగేది. కానీ నిధులు కేటాయించకపోవటంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారిపోయింది. ఇప్పుడు సీఎం నిర్ణయంతో చేవెళ్ల , శంకర్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల సొంత భవనాల ఆశలు చిగురించినట్లుగా మారాయి. సీఎం అధికారులకు సొంత భవనాలు లేని వాటికి స్థలాలు కేటాయించి భవనాలు నిర్మించేలా చూడాలని నిర్ణయించారు. కానీ ఇక్కడ స్థలాలు ముందే కేటాయించారు కాబట్టి భవన నిర్మాణాలకు నిధులు విడుదల చేస్తే సరిపోతుందని స్థానిక ప్రజలు అంటున్నారు. ఈ కార్యాలయాలకు అద్దె భవనాలు సరిపోక పలుమార్లు భవనాలు మారుస్తూ వస్తున్నారు. సొంత భవనం ఏర్పాటుతో ఈ కార్యాలయలకు అద్దె భవనాల బాధలు తీరనున్నాయి.



శంకర్‌పల్లిలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

నిధులు విడుదల చేయాలి



చేవెళ్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చేవెళ్లలో మొదటి నుంచి అద్దెభవనంలోనే కొనసాగుతోంది. సీఎం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను సొంతభవనాల ఏర్పాటుతో ఆధునీకరించాలనే ఆలోచన చేయటం సంతోషకరమైనది. చేవెళ్ల డివిజన్‌లో రెండు కార్యాలయాలు కొనసాగుతున్నాయి. రెండు మండలాల్లో సొంత భవనం లేకపోవటంతో అద్దె భవనాల్లోనే కొనసాగిస్తు వస్తున్నారు. రెండింటికీ ఆయా మండలాల్లో ప్రభుత్వం స్థలం కేటాయించింది. స్థలాలు సిద్ధంగానే ఉన్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేస్తే సొంత భవనం ఏర్పాటు అవుతుంది. సొంత భవనాలతో అద్దె సమస్యలు తీరుతాయి.

– విష్ణు, ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్, చేవెళ్ల

కొనసాగుతున్న రేణుక ఎల్లమ్మ జాతర

తాండూరు రూరల్: కోత్లాపూర్ శివారులోని రేణుక ఎల్లమ్మ అమ్మవారి జాతర కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కర్ణాటక, మహారాష్ట్రతో పాటు తాండూరు ప్రాంతం నుంచి వచ్చిన భక్తులు బోనాలతో నైవేద్యం సమర్పించారు. జాతరలో భాగంగా ఈ నెల 7వ తేదీన అమ్మవారి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ సిబ్బంది పేర్కొన్నారు.



ఆలయం వద్ద భక్తుల సందడి

యూనిఫామ్ కుట్టడంలో నాణ్యత పాటించాలి

కొందుర్గు: విద్యార్థుల యూనిఫామ్ కుట్టడంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డీఆర్డీఏ ఏపీడీ సూర్యారావు సూచించారు. బుధవారం ఆయన కొందుర్గు కుట్టు కేంద్రాన్ని సందర్శించి మహిళలతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తోంది పేద విద్యార్థులని, వారు మీ పిల్లలేనని, అందుకోసమే ప్రభుత్వం విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టే బాధ్యత మహిళా సంఘాలకు అప్పగించిందన్నారు. పాఠశాల నిర్వహణ, అభివృద్ధి బాధ్యత కూడా మహిళా సంఘాలదేనన్నారు. విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టడంతో మహిళలకు ఉపాధి అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం జయమాలిని, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



యూనిఫామ్‌లను పరిశీలిస్తున్న డీఆర్డీఏ ఏపీడీ సూర్యారావు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కొందుర్గు: మండలంలోని పలు గ్రామాలకు బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని కొందుర్గు ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరంగాపూర్ నుంచి ఉత్తరాసిపల్లి సబ్‌స్టేషన్ వరకు విద్యుత్ తీగలకు ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సందర్భంగా రేగడిచిల్కమర్రి, ముట్పూర్, చుక్కమెట్, ఉత్తరాసిపల్లి, టీకులపల్లి, బైరంపల్లి, మహదేవ్‌పూర్ గ్రామాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

నకిలీ విత్తనాలతో మోసపోవద్దు

పెద్దేముల్: విత్తనాలు, ఎరువులు ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయాలు చేస్తే చర్యలు తప్పవని తాండూరు వ్యవసాయ శాఖ ఏడీఏ రుద్రమూర్తి హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో పలు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తన స్టాక్, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తన కొనుగోలులో రసీదులు ఇవ్వకపోతే, అధిక ధరలకు విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రతి విత్తనానికి ఎరువులకు రసీదులు తప్పకుండా ఉండాలన్నారు. ఎరువులు, విత్తనాలు ఎవరైనా ఎక్కువ ధరలకు విక్రయాలు చేసినట్లు ఉంటే రైతులు రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే వారిపై విచారణ చేసి, తప్పు రుజువైతే లైసెన్స్ రద్దుతో పాటు యజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు. వ్యవసాయశాఖ నుంచి గుర్తింపు పొందిన షాపుల్లోనే విత్తనాలు ఖరీదు చేయాలని సూచించారు. విడిగా విత్తనాలు కొనడం మంచిది కాదని, కంపెనీ లేబుల్ ఉన్న ప్యాకెట్లను కొనాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ వినయ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న ఏడీఓ రుద్రమూర్తి

మహిళలకు ఆర్థిక ఉపాధి



హిమాయత్‌నగర్‌లో యూనిఫామ్ కుడుతున్న మహిళా సంఘాల సభ్యులు



చిన్నమంగళారంలో కుట్టిన దుస్తులను పరిశీలిస్తున్న విద్యాధికారి వెంకటయ్య

- దుస్తులు కుట్టడాన్ని ఆసక్తి చూపిస్తున్న మహిళా సంఘం సభ్యులు
- మండలంలో నాలుగు కుట్టు కేంద్రాలు
- ఒక్కో యూనిఫాంకు రూ.75 చెల్లింపు

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం ద్వారా మహిళలు దుస్తుల కుట్టుటతో ఆర్థిక ఉపాధి పొందుతున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌లను సకాలంలో అందించే దిశగా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అందులో భాగంగా మొయినాబాద్ మండలంలో మహిళా సమాఖ్య సంఘాల ద్వారా విద్యార్థుల యూనిఫామ్‌లను కుట్టిస్తున్నారు. మండలంలో గ్రామీణ పేదరిక నిర్మూలన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్, చిన్నమంగళారం, చిలుకూరు, అజీజ్‌నగర్ గ్రామాల్లో మహిళా శక్తి కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో మహిళా సంఘాల్లో ఉన్న సభ్యులు కుట్టుమిషన్ నేర్చుకున్న వారు విద్యార్థుల దుస్తులు కుట్టేందుకు ఎంపిక చేశారు. మండలంలో 28 గ్రామ పంచాయతీల్లో గల ఆయా పాఠశాలల్లో చదువుతున్న 4888 మంది విద్యార్థులకు యూనిఫామ్‌లను కుడుతున్నారు. ఈ నెల 10వ తేదీలోపు ఆయా విద్యాసంస్థలకు అందించేందుకు జోరుగా దుస్తుల కుట్టుట సాగుతోంది. ఈ నాలుగు కేంద్రాల్లో 48 మంది మహిళలు ఉదయం 10 గంటల నుంచి 6 గంటల వరకు దుస్తులను కుడుతూ పనులు వేగవంతం చేస్తున్నారు. ఒక విద్యార్థి యూనిఫామ్‌కు 75 రూపాయల చొప్పున ప్రభుత్వం ద్వారా అందిస్తున్నారు. మహిళలు రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు 10–15 వరకు కుడుతున్నామని పేర్కొంటున్నారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు ఈ పని ఇవ్వడం ఎంతో బాగుందని చెబుతున్నారు. ఇదే తరహాలో నిరంతరం కొనసాగేలా ఇలాంటి ఆర్థిక ఉపాధి పొందే పథకాలను మహిళలకు ఏర్పాటు చేస్తే ఎంతో బాగుంటుందని పలువురు అంటున్నారు.

నిరంతరం ఉండాలి



మహిళా సంఘంలో ఉంటూ కుట్టు శిక్షణ రావడంతో ఆర్థిక ఉపాధి కలిగింది. ప్రభుత్వపరంగా పాఠశాలల విద్యార్థులకు దుస్తులు కుట్టే పనిని మహిళా సంఘాలకు అందించడంతో మంచి అవకాశం కల్పించారు. ఇలాంటి అవకాశాలు నిరంతరం ఉండేలా చూడాలి.

– శివలీల

రోజుకు 10 నుంచి11 కుడుతున్నాం



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం యూనిఫామ్‌ల పంపిణీలో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు పని కల్పించడం అదృష్టం. ఒక యూనిఫామ్ కుడితే 75 రూపాయల చొప్పున అందిస్తున్నారు. ఒక రోజుకు ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తే 10 నుంచి 11 యూనిఫామ్‌లు కుడుతున్నాం. ఇది బాగానే ఉంది.

– పరంజ్యోతి

త్వరలోనే పూర్తి చేసేందుకు కృషి



మండలంలో 4888 మంది వి ద్యార్థులకు ఈ పాఠశాలలు పునఃప్రారంభం ముందే అందించేందుకు కృషి చేస్తున్నాం. మండలంలోని అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, చిన్నమంగళారం, చి లుకూరు గ్రామాల్లో మహిళా సమాఖ్య 48 మంది సభ్యు లతో కుట్టడం ప్రారంభించాం. త్వరలోనే పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. ఈ కుట్టు కేంద్రాల్లో మహిళలు ఉదయం 10 గంటల నుంచి 6 గంటల వరకు కుడుతున్నారు.

– రవీందర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్, మొయినాబాద్